# 12

## క్రాస్‌వర్డ్ పజిల్

"వీరరాఘవ స్వామివారి ఆలయంలో సంగీత కచ్చేరీ ఉంది. వెళదాం రా శ్యామూ. చాలా బాగా పాడుతుంది. నువ్వుకూడా వస్తేకాని నాకు సంతోషంగా ఉండదు. రావా?" అని, ఎక్కడ రానంటుందో నన్న అనుమానంతో, భయంతో, ఉద్వేగంతో, అసంతృప్తితో వేడుకున్నాడు భార్యను రఘురామ్. అతడి మాటల్లో ఎంతో ఉత్సాహమూ, ఆశాకూడా వ్యక్తమవుతూ ఉన్నాయి. శ్యామ సుందరి చిత్రంగా నవ్వింది.

మునిపంట మల్లెపూలూ, కనకాంబరాలూ కట్టిన పూలమాల కొసదారాన్ని కొరుకుతూ భర్తవేపు చిత్రంగా చూపింది.

మహా ఫాషనబుల్‌గా చీర కట్టుకుంది. అంటీ అంటనట్లుగా కన్నులకు కాటుక పెట్టింది. ఎక్కడకో ప్రోగ్రాం వేసుకున్నదనే ట్లుగా ఉన్నాయి ఆమె చూపులూ, వాలకమూను. అతడు అడగలేదు. ఒకవిధంగా అతడు ఆమెముందు లొంగిపోయినవాడిలాగానూ, అణగి మణగి ఉండవలసినవాడిలాగానూ భావించుకుంటూ ఉంటాడు. దీనికి కారణం ఆవిడగారి అతిశయమన్నా, రఘురామ్ జాలి మనస్సూ, సరళ మైన ప్రవృత్తీ కారణం అనుకున్నా, రెండూ ఒకేవిషయాన్ని చెప్ప టమే. ఏది ఏమైనా, ఏమిటో వెలితినీ, అసంతృప్తినీ, బోలుతనాన్నీ భావిస్తూవుంటాడు రఘురామ్ ఆవిడ ప్రవర్తనను తలచుకొని. కోర్టు నుంచి అమితోత్సాహంగా, అమిత సంతోషంగా ఇవాళ అయిదు

గంటలకల్లా వచ్చేశాడు రఘురామ్. వచ్చేసరికి శ్యామసుందరి ఎక్కడికో వెళుతున్నదానిలా అలంకరించుకోవటం చూపి అతడి ఉత్సాహం నీరు కారిపోయింది. అయినా ఆమెయెడల తనకు ఉండవలసిన అనురాగం నిలవనియ్యక అడిగాడు సంగీతకచ్చేరికి రావలసిందని.

"అయ్యో! మీరు నిన్ననైనా చెప్పారుకాదు." అంది శ్యామసుందరి టేబిల్‌మీదున్న ఫ్లాస్కులోంచి కాఫీ కప్పులోకి పోస్తూ.

రఘురామ్‌కి చాలా దుఃఖం కలిగింది. ఒకవేళ తాను రావటం కొంచెం ఆలస్యమయిఉంటే ఈవిడ వెళ్ళిపోయి ఉండేదని ఫ్లాస్కులో పోసి టేబిల్‌మీద పెట్టిన కాఫీ కర్థం.

కాఫీ చప్పరిస్తుంటే చేదుగా ఉన్న ట్లనిపించింది.

పోనీ, ఆ సంజాయిషీ అయినా పూర్తిగాచెప్పలేదు. 'చూశావా చిన్నతనంనుంచీ వ్యక్తులు పెరిగిన పరిస్థితులు,వాళ్ళకు ఇచ్చిన శిక్షణ, వాళ్ళ అభిరుచులూ పెద్దయిన తరువాతకూడా వాళ్ళ వ్యక్తిత్వాన్నెట్లా తీర్చిదిద్దుతాయో' అనుకున్నాడు రఘురామ్. తాను చిన్నప్పటినుంచీ ఏ పని చేయాలన్నా ఎంతో ముందూ వెనుకా ఆలోచించి, ఎంతో భయపడిపోతూ, ఆ పని పూర్తయిందాకాకూడా అవుతుందా కాదా అన్న ఆందోళనతోనే చేసేవాడు. శ్యామసుందరీ వాళ్ళకు ఆ అవసరం ఏముంది కనుక? అందుకే ఆ నిర్లక్ష్యం, ఆ నిర్భీకత, ఆ హుందాతనం.

ఆమె తనతో రాలేకపోవటానికి కారణాన్ని అనునయంగా చెప్పి, తనను బతిమాలుకున్నా, 'ఇలా ఉన్నాయి పరిస్థితులు, నే నేం చెయ్యను చెప్పండి? నలుగురిలోనూ మీ శ్యామకు అవమానం కలిగితే, చెడ్డపేరు వస్తే మీరు ఓర్చుకోగలరా?' అని ప్రేమగా తనను వొప్పించినా, తా నీ అసంతృప్తినీ, అరుచినీ పొందవలసిన అవసరం ఉండదుకదా అన్న ఆలోచన కలిగితే అవతలి వ్యక్తిమీద రఘుకు ఎంతో చికాకూ, అసహ్యమూకూడా పుట్టుకొనివస్తాయి. అతడు ఎంత సేపు ఎదురుచూపినా జేబురుమాలు సర్దుకోవటమూ, నోట్లూ చిల్లరా లెక్కించుకోవటమూ, అద్దంముందుకు వెళ్ళి చూసుకోవటమే చేస్తూంది కాని తన మనవిని ఆలకించినట్లు ఉలుకూ పలుకూ లేకపోయె. తా

నెదురుగా ఉన్నాడుకదా ఆమె అందం చూసుకోవటానికి అద్దం ఎందుకు? ఆమె అందానికి తనకన్నా మించిన అద్దం ఎక్కడుంది? ఏముంది? తన నడగకూడదు కాబోలు. 'ఈ చీరకు యీ చోళీ బావుందా' అనో, లేక కొంచెం 'ఈ పూలు కాస్త జడలో ముడుద్దురూ, త్వర త్వరగా పోవాలి. టైమ్‌లేదు' అనో అన్నా తాను సంతోషించేవాడు కదా. ఇంత నిర్లక్ష్యంగా తనకు పూర్తిగా సమాధానంకూడా చెప్పని ఈ భార్యను తా నేమని రెండోసారి బతిమాలుకుంటాడు? అయినా బింకంకాని, అభిమానంకాని క్షణంకూడా నిలవలేదు. ఇలా ఇంత అందంగా, ఇంత సంతోషంగా ఉన్న శ్యామ తనపక్కనే నడుస్తూ ఉంటే స్వామివారి ఆలయంలో సంగీతకచ్చేరీకి వెళ్ళి అందరూ తమ నిద్దరినీ చూసి మనస్సులోనే మెచ్చుకుంటూఉంటే, అభినందిస్తూఉంటే, సంగీతకచ్చేరీ అయిపోయిన తరవాత ప్రదక్షిణంచేసి స్వామివారినీ అమ్మవారినీ దర్శించుకొని చల్లపాటువేళ ఇంటికి తిరిగివస్తే ఈ రోజును తాను జన్మలో మరచిపోగలడా? ఎంత సంతోషంగా ఉంటుందీ తన కప్పుడు? ఆవిడ కంత ఇష్టం లేకపోయినా ముఖావంగానైనా సరే తనఇష్టాన్ని మన్నిస్తే బావుండు ననుకున్నాడు రఘు. అందుకని నిలవలేక "పోనీ, ఈ ఒక్కరోజుకూ నీ ప్రోగ్రాం కాన్సిల్ చేసుకోకూడ దేమిటి? రోజూ ఉంటుందా సంగీత కచేరీ? ఇవాళ నాతో రావలసిందే నీవు. ఏమైనా సరే" అన్నాడు రఘు ప్రేమాభిమానాలు తనమాటల్లో నింపుతూ. మారాంచేస్తున్న చిన్న పిల్లవాణ్ణి కళ్ళతో ఆపేక్షగా బెదరిస్తున్న తల్లిలాగా చూసింది అతడి వేపు శ్యామసుందరి. ఆవిడ ఆంతర్యాం అతడికేమీ అర్థంకాలేదు. తానుకూడా లేచి గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

పందిరి పట్టె మంచంమీద మిగిలిపోయిన విడిపూలు అతణ్ణి పరిహసిస్తున్నట్లనిపించింది. వెళ్ళి తానుకూడా బీరువాకున్న నిలువుటద్దంలో తన ముఖం చూసుకున్నాడు. మనస్సులోని అసంతృప్తి అంతా ముఖంనిండా పులుముకొని ఉన్నట్లుగా ముఖమంతా మలినంగా, నల్లగా ఉంది. జుట్టు చిందరవందరగా ఉంది. బట్టలన్నీ నలిగి

ఉన్నాయి. తనకూ బీరువాలో కావలసినన్ని మంచిబట్ట లున్నాయి. కాని అతడికి సంతోషంలేదు. వాటిని తీసి ధరించాలన్న ఇష్టమూ లేదు. శ్యామసుందరిని చూసి తనను చూసుకుంటే గుమాస్తా జీవితం లోని ఒకటవ తారీకు, ముప్ఫయ్యొకటవ తారీకూ లాగున్నారు—ఉత్సాహం అతిశయం ఒకచోట, బడలికా అసంతృప్తి ఇంకొకచోట ఉండటంమూలాన. "బట్టలు మార్చుకుని ముఖం కడుక్కుని వెళ్ళండి" అన్నది శ్యామసుందరి. అతడి కదికాదు కావలపింది. ఆమె ఎట్లాగూ తనతో సంగీతకచేరికి రాదు. కాని ఇదిగో ఇందుకు రాలేకపోతున్నానని అనునయమూ ప్రేమా అభిమానంతో కూడిన సంజాయిషీ అయినా చెప్పుకోకూడదా? చెప్పుకునేదయితే తనతో వచ్చేఉండేది.

"సరేలే, నే నెలాగో వెళతాను. నువ్వు రావటంలేదుగా?" అన్నాడు.

"మీకు కోపం వస్తూన్నట్లున్నదే!"

ఇదేమిటో సవాలులాగ ఉంది.

"నాకు కోపం ఎందుకూ?" అతడికి చాలాచాలా అనాలని ఉంది. కాని ఏమీ అనలేక స్థాణువులాగా ఉండిపోయాడు కాసేపు.

"ఇవాళ మహిళామండలిలో నే నొక విషయాన్నిగురించి వ్యాసం చదువుతున్నాను. కలెక్టరుగారి భార్యా, జడ్జీగారి భార్యా వాళ్ళంతా వస్తారు. ఇవాళ నేను మానుకుంటే నాకు సిగ్గుచేటుకాదూ. వా ళ్ళేమనుకుంటారు? నే నా వ్యాసం వ్రాయలేక రాలేదనుకోరూ?"

రఘుకు ఇదేచాలు ననిపించింది. "నిజంకాదూ పాపం!" అనుకున్నాడు.

"మరి నా కా వ్యాసం చూపలేదేమి?" అన్నాడు.

శ్యామసుందరి అందంగా నవ్వింది. "తరవాత చూద్దురుగాని లెండి. నేను వెళుతున్నాను. టైమ్‌కూడా అయిపోయింది."

శ్యామ వెళ్ళిపోయింది.

రఘురామ్ అసంతృప్తిగా కుర్చీలో కూలబడిపోయాడు.

జీవితంలో తనకేమీ వెలితీ అసంతృప్తీ ఉండకూడదు

న్యాయానికి. అన్నీ ఉన్నాయి. అందమైన భార్యా, ఆవిడతాలూకు ఐశ్వర్యమూ, ప్రాక్టీసు ఉన్నా లేకపోయినా బాధలేని ప్లీడరుగిరీ, చదువూ, సంస్కారమూ అన్నీఉన్నాకూడా ఏమీ లేనట్లూ, చందమామ లేని ఆకాశంలాగూ,శ్రుతిలేని సంగీత సాధనలాగా, ఆకలిలేని భోజనం లాగా జీవితం చాలా అసంతృప్తిగా ఉందని అనిపించిం దతనికి.

ఈ రకమైన జీవితాన్ని అతడు చాలారోజులనుంచి భరించలేక పోతున్నాడు. భరించలేకపోయినా చేసేదేమీలేదు. జీవితంలో అన్నీ ఉండికూడా అభిశాపం పొందినవాడిలాగా ఉండటం కష్టం. మొట్ట మొదటినుంచీకూడా జీవితంలో తా నెదుర్కొనవలసివచ్చిన సమస్యల వల్లనూ, ప్రత్యేక పరిస్థితులవల్లనూ తాను అమిత సాధువుగానూ, భయస్థుడుగానూ ఉండవలసి వచ్చింది. తీరా అలా ఉండటం అలవా టైన తరవాత అలా ఉండటంలో ఏమాత్రమూ తప్పులేదనికూడా అనిపిస్తున్నది. ఎందుకంటే చాలామంది మనుష్యులు తమతమ జీవి తాలలో ఎంత ఖిన్నులుగానూ, దీనులుగానూ ఉండవలసివస్తుందో దారిద్ర్యము, అనారోగ్యము వాళ్ళ నెంత నిస్సహాయులను చేస్తాయో తనకు తెలుసు. అటువంటి పరిస్థితులలో అన్నివిధాలా తమకన్నా బాగా బతుకుతున్నవాళ్లు తమను హేళనపరిస్తేగాని,తృణీకరిస్తేగాని,నిరాదరణ కనపరిస్తేకాని మనస్సు ఎంత చచ్చిపోతుందో తనకు తెలుసు. నిజానికి ఏ కొంచెం జ్ఞానం వున్న మనిషైనా ఇతరులకన్నా తన ఆధిక్యాన్ని ఎప్పుడూ మనస్సులోకి రానివ్వడు. సుఖదుఃఖాలనేవి ఏవైతే ఉన్నాయో వాటి అనుభవం యీ లోకంలో ఎవరికైనా సమానమే. తమవాళ్ళు చచ్చిపోతే అందరూ ఒకేలా ఏడుస్తారు. పిల్లలు అందరికీ ఒకేలాగున పుడతారు. అటువంటప్పుడు మనిషి మనిషిని ఈసడించటం ఎంత అర్థంలేని విషయమో తలుచుకుంటే అతడి మనస్సు కలుక్కుమంటుంది.అదేపనిగా నీటిధార పడితే నును పెక్కిన బండరాయిలా అతడి మనస్సు చాలా మెత్తబడిపోయింది. తన ఇరవైఏడు ఇరవైఎనిమిది సంవత్సరాల జీవితంలో తానెదు ర్కొన్న సంఘటనలతో, వచ్చే ఆదాయంచాలక పదిమంది పిల్లలను

పోషించుకోలేక చదువులు,పురుళ్ళు,పుణ్యాలు,కష్టసుఖాలు వీటన్నిటితో, అనేక నిందలతో, అపవాదులతో దరీదోవా చూపకుండా తండ్రి సంసారాన్ని పదుగురి నోళ్ళలోనూ పడవేసి చనిపోయాడు. ఆడ పిల్లల పెళ్ళిళ్ళుచేసే ఆయన చనిపోయారు కాబట్టి సరిపోయింది. లేకపోతే మరీ ఎంత అవస్థలపాలయ్యేవారో చెప్పనలవికాకపోయేది. అన్నయ్య కలప అడితీలో గుమాస్తాగా చేరి పిల్లలను పెద్దవాళ్ళను చేశాడు.

అన్నయ్య పడే కష్టాన్ని తాను ప్రతిరోజూ గమనిస్తూ ఉండే వాడు కాబట్టి బుద్ధిగానే చదువుకున్నాడు. ఒక్కొక్క క్లాసూజాగ్రత్తగా చదివి పాసవుతూవచ్చాడు. స్కూలుఫైనలు పాసుకాగానే తానూ ఉద్యోగం చేస్తానన్నాడు. కాని ఉన్నవూళ్ళో కాలేజీవున్నందున అన్నయ్య ఉద్యోగం చెయ్యనివ్వలేదు. తాను కాలేజీలో చేరిన రోజున అన్నయ్య జీవితంలో ఎంతో మహత్కార్యం సాధించిన వాడిలా సంతోషపడటం తాను ఆజన్మాంతం మరచిపోలేడు. ఊళ్ళో పెద్దపెద్ద ఉద్యోగాలుచేస్తూ పెద్దపెద్ద హోదాల ననుభవిస్తూ వున్న వాళ్ళ పిల్లలకంటే తన తమ్ముడు ఎందులో తక్కువ? వాళ్ళందరూ ఏం సాధించారో తాను దానిని సాధించగలిగాడు అని అమ్మతో చెపుతూవుంటే ఆరోజు తానెంతో ఉప్పొంగి పోయాడు.

తాను బి.ఏ. చదువుకుంటూ ఉండగానే యీ సంబంధం వచ్చింది. తనకప్పటికి పెళ్ళి, దానికిసంబంధించిన సమస్యలు, జీవితంలో దాని ప్రాధాన్యం మొదలైనవాటిగూర్చి ఏమీ తెలియదు. సృష్టిలో స్త్రీపురుష సంబంధాన్ని గురించిన ఉత్కంఠ, తీయని ఊహలుకూడా ఆ వయస్సులో తననంతగా వశ్యుణ్ణిచేసుకోలేదు. తనముందు గొప్ప బాధ్యతతోకూడిన మార్గమూ, ఏకాగ్రతతో కూడిన ప్రయత్నమూ పరచుకుని ఉన్నాయి. అందువల్ల ఇతర విషయాలను గురించి పట్టించుకునేటంత మానసిక దార్ఢ్యంకూడా తనలో కొరవడింది. క్లాసులో ఫస్టుగా ఉండటం, గొప్ప ఉద్యోగం

సంపాదించటం, తన కుటుంబాన్ని అందరికన్నా మిన్నగా చక్కదిద్దు కోవటం అతడి ధ్యేయంగా ఉండేది. శ్యామసుందరిని తనకిస్తామని ప్లీడరుగారు రావటం చాలా విచిత్రమైన పరిస్థితులలో జరిగింది.

ఆయనగారు జీవితంలో తన తెలివి అంతా ఉపయోగించి, తన అదృష్టాన్నంతటినీ పరీక్షకుపెట్టి తన అక్కగారి తాలూకు రెండు లక్షల ఆస్తిని మృతుడైన ఆమె భర్తగారి దాయాదులకు చెంద కుండా కాపాడారు. అప్పుడాయనకు గొప్ప సమస్య ఎదురైంది. అది తన ఏకైకపుత్రిక వివాహం. శ్యామసుందరి ఆయనగారి ఏకైక పుత్రిక కావటంవల్ల ఆమె వివాహం ఆయనగారికి గొప్ప సమస్యే అయింది. అందువల్ల ఆయన వ్యవహారదక్షతనంతా ఉప యోగించి రఘును తన విధవ అప్పగారికి దత్తు చేయించారు.

రఘురామ్‌ను దత్తు ఇవ్వడానికి వాళ్ళ అన్నయ్య ఎంత కుంగి పోయిందీ, ఎంత బాధ పడిందీ వాళ్ళమ్మకుకూడా తెలీదు. వాళ్ళమ్మ ప్లీడరు గారింటికి రాకపోకలు సాగించటమూ, అక్కడ ఆమెగారికి ఆదరసత్కార మర్యాదలు అధికం కావటమూ ఆమెకళ్ళు కప్పి వేశాయి. బీదతనంలో అన్నీ సుగుణాలే ఉంటాయి సామాన్యంగా. కాని ఒక గొప్ప దుర్గుణంమాత్రం వుంది. డబ్బునుగురించి బీద వాడికి పచ్చగడ్డిని చూసిన పసరంప్రవృత్తి ఉంటుంది. అలాంటి సందర్భం ఎన్నడైనా తటస్థిస్తుందా, వాళ్ళను వాళ్ళు నిగ్రహించుకో లేరు. బాగా ఆకలిగొన్నవాడికి అన్నాన్ని చూసినప్పటి ఆబ ఎలాటిదో డబ్బుగలవాళ్ళ స్నేహబాంధవ్యాలు దరిద్రుడియెడలకూడా అంతే. రఘు అభిప్రాయం అడిగినవాళ్ళు కానీ, అతడి ఇష్టానిష్టాలు పట్టించు కున్నవాళ్ళు కానీ ఎవరూలేరు. ప్లీడరుగారు రఘును దత్తు తీసుకుంటా నంటే వీళ్ళకు అభ్యంతరం ఉండేదేమోకాని, రూపసి అయిన కోడలు బోలెడంత డబ్బుతో వస్తుందనేసరికి తల్లికి వేరొక ఆలోచనే లేకపోయింది. ఎవరైనా ఓర్వలేనివాళ్ళు కాని మాటలు చెప్పి, ఈ అదృష్టాన్ని ఎక్కడ చెడగొడుతారోననికూడా తల్లి నిద్రాహారాలు లేకుండా బాధపడింది. కాని ఆమె అనుకున్న అదృష్టమంతా కలిసి

వచ్చి రఘును ప్లీడరుగారి విధవ అప్పగారు దత్తుచేసుకుంది. అందు వల్ల రఘు అన్నగారికి వొకేవొక గొప్ప అదృష్టం కలిగింది. అది తమ్ముడికి పుస్తకాలకూ, కాగితాలకు, పరీక్షఫీజులకూ, అయినవాళ్ళను కానివాళ్ళను యాచించి అనేక అసత్యాలుచెప్పి అప్పు అనే పదార్థాన్ని పుట్టించడంలో కల నైచ్యంనుండి, కష్టంనుండి విముక్తి. కాని మామూలు పరిస్థితికి తిరిగిరాని అంగవైకల్యం కలిగినట్లుగా బాధపడ్డా డతడు తమ్ముడు దత్తుపోవటం గురించి.

తనబాధ ఏమిటో దాని స్వరూపాన్ని అవగాహన చేసుకోలేక తనకు ఆప్తులు, పితృసములు అయిన పెద్దమనిషిని ఒకాయనను "ఈ విషయమై మీ సలహా ఏమిటి? అభిప్రాయం ఏమిటి?" అని అడిగితే ఆయన "ఇదుగో ఒకవేళ యీ ఛాన్సు నీకే లభిస్తుందనుకో, నువ్వేం చేసేవాడివి?" అన్నారు. దానితో అతడికి ఆపుకోలేని దుఃఖంవచ్చింది. లోకం తాను తమ్ముణ్ణిచూసి ఈర్ష్యపడుతున్నా డనుకుంటుంది కాబోలు. అతడు ఆ విషయంలో అప్పటినుంచి మూగవాడే అయిపోయినాడు. రఘు దత్తుపోయినాకూడా బి.ఏ. లో ఫస్టుక్లాసు రాకపోయినందుకు అన్నగారు చాలా బాధపడిన మాటమాత్రం నిజం. రఘు పాసవుతున్నాడంటే తానే అయినట్లుకూడా అతడి భావన. బి.ఏ. కాగానే వేరొక ఆలోచనలేకుండా రఘు బి.ఎల్. కు వెళ్ళాడు. శ్యామసుందరిని బి.ఏ. లో చేర్చారు. రఘు బి.ఎల్. చదువుతూ వుండగానే అన్నగారికి పెళ్ళయింది. బి.ఎల్. కాగానే రఘుకూ పెళ్ళయింది. మామగారిదగ్గరే ఎప్రంటీస్ పూర్తిచేశాడు రఘు. ఎప్రంటీస్ అయి స్వంతంగా ప్రాక్టీస్ చూచుకుందామనుకుంటూ ఉండగానే మామగారు ఆస్తిపాస్తులను ఎవరెవరిపేర వ్రాయవలసిందీ బాగా ఆలోచించి ఆ కాస్త 'విల్లు' వ్రాసిపడేసి హరీమన్నారు. పంజరమేకాక అది బంగారు పంజరమూ అయింది రఘుకు. రోజూ ఆపిల్‌పళ్ళముక్కలూ, అరటిపళ్ళూ ఆప్యాయంగా శ్యామసుందరి పంజరంలో పడేస్తుంది. ప్లీడరుగారుండగా వంటావిడవుండేది. ప్లీడరుగారు పోయినతరువాత పరామర్శించటానికి తల్లివచ్చి నెల

రోజులపైనే వుండటంతో వంటమనిషి అవసరం కనబడలేదు వాళ్ళకు. తన కొడుక్కు అనవసరపు ఖర్చనుకుంది ఆ అమాయకపు తల్లి. కాని తాను వంటమనిషినన్న విషయం కొద్దిరోజులతరవాత గ్రహించేసరికి తాను తనకొడుకు దగ్గరికే వెళ్ళక తప్పలేదు.

రఘుకు తనతల్లి అంటే ఒకరకంగా వైమనస్యం. దత్తుతల్లి అంటే భయం. ఇది క్లుప్తంగా రఘురామ్ పూర్వగాథ. అతడు రోజుకు పదిసార్లు గుర్తుచేసుకునే కథ.

ఇవాళమళ్ళీ వివరంగా మనస్సులో తవ్విపోసుకున్నాడు.

శ్యామసుందరి క్లబ్బుకు వెళ్ళిపోయింది. తన దత్తుతల్లి సంపూర్ణయాత్రా స్పెషల్‌లో ఉత్తరదేశంలో వుంది.

బట్టల బీరువాకు ఉన్న నిలువుటద్దంలో తన ముఖం చూసుకున్నాడు. అలిసిపోయి జిడ్డు ఓడుతున్నది. క్రాపు చెదరిపోయింది. బట్టలు నలిగిపోయి ఉన్నాయి. కాని ముఖం కడుక్కుందామన్నకోరిక కానీ, బట్టలు మార్చుకుందామన్న ఉత్సాహంకానీ అతడికి ఏ మాత్రమూ కలగలేదు. ఈ పదిగదుల డాబా ఇల్లుకంటే తమ ఇల్లే నయమనిపించింది. అది ఇరుకుసందులో మురికి కాలవపక్కఉన్న పెంకుటిల్లు. అది అద్దె ఇల్లే కావచ్చు గాక. దాని తాలూకు ఆలోచనలే, పూర్వానుభూతులే ఆతడి మనస్సును సంతృప్తితో నింపివేస్తాయి. కోటలాగా ఇంత ఇల్లు ఉన్నా బిక్కుబిక్కుమంటూ ఉంటుంది ఇక్కడ.

రఘు వీధిలోకి వచ్చేశాడు. అప్పటికి ఆరుగంటలు కావస్తున్నది. పెద్ద బజారుగుండా వెళ్ళి ఒకమైలుదూరం నడిస్తేకాని దేవాలయంరాదు. సినిమాహాలు దాటినతరువాత సిమెంటు రోడ్డు మీదనే మహిళామండలి వాళ్ళ క్లబ్బు ఉన్నది. దానినిదాటే వెళ్ళాలి ఆలయానికి పోవటానికి.

రఘు నడిచేవెళ్ళాడు. సినిమాహాలు దాటి క్లబ్బుముందుగా వెళుతుంటే ఆతడికి అల్లంతదూరంలో ఫిడేలు పట్టుకుని వెంకటలక్ష్మి ఎదురైంది. వసంతఋతువులోకూడా పుష్పించని పూలతీగలా ఉంది. ఆ అమ్మాయి-అసంతృప్తి అంతా ఒకచోట కుప్పబోసినట్లు. సినిమా

హోలుపక్కనే వాళ్ళ ఇల్లు. మామూలురంగు చీర కట్టుకుంది వెంకటలక్ష్మి. మెడంతా బోసిగా ఉంది. చెవులకు దుద్దులుకూడాలేవు. ఎర్రగా పొడుగ్గా బక్కపలచగా వాడిపోయిన తమలపాకులా ఉంది. కాళ్ళకు చెప్పులుకూడా లేవు. అమితంగా అలిసిపోయి ఇంటికి వెళుతూ తన కట్లా ఎదురుకావటం రఘు మనస్సుకు ఆమె యెడల చాలా జాలి కలిగించింది. కాని మళ్ళీ అంతలోనే తన మనస్సులో తాను ఇలా వితర్కించుకున్నాడు: "ఆ అమ్మాయికన్నా తాను ఏమి తృప్తిగా జీవిస్తున్నాడు? ఆ అమ్మాయినిగూర్చి తాను జాలిపడటం చాలా పరిహాస పాత్రమైన విషయం. ఏమో! వెంకటలక్ష్మి జీవితంలో ఏమీ వెలితిలేదేమో? డబ్బుచాలని ఇబ్బందితప్ప, భర్తనుగూర్చి ఆమెకు ఎలాటి అసంతృప్తి లేదేమో. తాను ఏవో రెండుమూడు సంగీతపాఠాలు ట్యూషన్ చెప్పి పది పదిహేను రూపాయలు సంపాదిస్తుంది. మొగుడేదో డెబ్భయ్యో ఎనభైయ్యో తెస్తాడు. రోజులు మామూలుగా వెళ్ళిపోతూ ఉంటాయి. అటువంటప్పుడు ఆమెకు అసంతృప్తి ఎందుకు?

పెద్ద బజార్లో ఉడిపి సుందరవిలాస్ ముందు కిళ్లీషాపుదగ్గర వెంకటలక్ష్మిభర్త వెంకటేశ్వర్లు కనిపించాడు. సిగ్గులేని నవ్వుతో తనను పలకరించాడు. రఘుకు అతణ్ణి పలకరించటానికికూడా అసహ్యం కలిగింది. ఇదివరలో సౌజన్యంకోసం పలకరిస్తే తన ఎదురుగావచ్చి కాఫీహోటల్లో కూచుని అధిక ప్రసంగం చేసేవాడు. అందుచేత తరువాత అతడు పలకరించినా చూసీచూడనట్లు పోవటానికి ఎంతో బాధపడిపోయేవాడు రఘురామ్. ఎడంచేతిలో బీడీ కట్టతో, కుడిచేతిలో కాలుతున్న బీడీతో అతణ్ణిచూస్తేనే వెలపరం కలిగింది రఘుకు. వెంకటలక్ష్మి భర్త మునిసిపల్ ఆఫీసులో ఏదో గుమాస్తాపని చేస్తున్నాడు. రోజూ రెండు బీడీకట్టలు కొనుక్కోవటం తప్ప అతడి జీవితానికి ఇంకొక చరితార్థత లేదని అతని భావన. రఘురామ్ కాఫీతాగి బయటకువచ్చాడు. వెంకటలక్ష్మి ఇంటికివెళ్ళి అప్పుడే ఎలా వచ్చిందో పెద్ద బజార్లో వాదిగివాదిగి నడిచిపోతున్నది.

కిల్లీకొట్టుదగ్గర వెంకటేశ్వర్లు ఎవరితోనో బాతాఖానీవేస్తున్నాడు. కొంతదూరం నడిచేసరికి రఘురామ్‌కు వెంకటలక్ష్మి ఎక్కడకు వెళుతున్నదో అర్థమైంది. వీరరాఘవస్వామి ఆలయానికి వెళ్ళేటప్పటికి చాలామంది సంగీత కచ్చేరీకొరకు హాజరైవున్నారు. వేదిక చక్కగా బారులైట్లతో అలంకరించారు. పక్కవాద్యాలవాళ్ళు అప్పుడే వేదిక మీద చేరారు. ఇంకా కచ్చేరి ప్రారంభంకాలేదు. రఘురామ్‌ను తెలిపిన వాళ్ళు ఆదరంగా ఆహ్వానించి ముందువరస కుర్చీలలో వాకదాంట్లో కూర్చోబెట్టారు. మామూలుగా రఘురామ్ ఇటువంటి సాంస్కృతిక కార్యకలాపాలకు బాగా విరాళాలు ఇస్తూఉండటమే దానికి కారణం. ఊళ్ళోఉన్న పెద్దమనుషులు చాలామంది వచ్చారు. ముందువరసలో పెద్దపెద్ద ఉద్యోగస్థులు కొందరు భార్యామణులతోసహా వచ్చి కూచున్నారు. రఘుకు శ్యాము తనతో రాకపోవటం చాలా అసంతృప్తినీ, విచారాన్నీ కలిగించింది.

పాటకచ్చేరీ ప్రారంభమైంది. పక్కన ఆడవాళ్ళు కూచున్న చోట వెంకటలక్ష్మిని చూశాడు రఘురామ్. ఆమె అత్యంతాసక్తితో తన్మయురాలై అనుభవిస్తున్నది సంగీతమాధుర్యాన్ని. గాయకురాలు చక్కగా పాడుతున్నది. శ్రోతలను ఏదివ్యలోకాలకో తరలించుకొని వెళుతున్నది. ఏ పువ్వులతోటలలోనో విహరింపజేస్తున్నది. ఎందుకో రఘు మనస్సును చిక్కబట్టుకోలేక వెంకటలక్ష్మివేపు చాలాసార్లు చూశాడు. తాను పెద్దపెద్ద ఉద్యోగస్థులు కూర్చున్న ముందువరస కుర్చీలలో కూర్చున్నాడు. వెంకటలక్ష్మి ఆడవాళ్ళకు ప్రత్యేకించిన స్థలంలో కింద స్తంభానికి జేరగిలబడి కూర్చున్నది. ఒకటి రెండు సార్లు వెంకటలక్ష్మికి పట్టుబడిపోయాడు రఘురామ్.

సంగీత కచ్చేరీ పూర్తయ్యేసరికి తొమ్మిదింబావయింది. గాయకురాలిని అభినందించటానికి నలుగురు పెద్దలతోబాటు తానూ వెళ్లాడు రఘురామ్. అక్కడ పెద్దపెద్ద కళ్ళనిండా తన సంతోషాన్ని వ్యక్తపరుస్తూ వెంకటలక్ష్మి నిలుచుని ఉంది. ఆ గాయకురాలిని చూడటం, ఆమె దగ్గరగా నిలబడటం జీవితంలో గొప్ప అదృష్టంలా భావిస్తు

న్నట్లు వెంకటలక్ష్మి కళ్లు వెలిగిపోతున్నాయి. రఘు వెంకటలక్ష్మి సమక్షంలో ఆ గాయకురాలిని అభినందించటానికి సిగ్గుపడ్డాడు. వెంకటలక్ష్మి ఆమెతో ఏదో కొంత మాట్లాడింది. అదంతా శాస్త్ర ప్రసంగం. నమస్కారంపెట్టి ఎంతో సంతోషంతో ఆమె దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. రఘురామ్ పక్కన ఉన్నవాళ్ళ మాటలలోనే తన అభినందనలుకూడా తెలిపి బయటకు వచ్చేశాడు. ధ్వజ స్తంభంవద్ద గర్భ గుడికి ప్రదక్షిణం చేస్తూ వెంకటలక్ష్మి కనపడింది. నిముషంసేపు అతడికికూడా ప్రదక్షిణం చేద్దామనిపించింది కాని ఏమిటో బిడియం కలిగి అలా చెయ్యలేకపోయాడు. సింహద్వారంవద్ద నిలుచుని దేవుడికి నమస్కారంపెట్టి బయటకి నాలుగడుగులు వెయ్యగానే రిక్షావాళ్లు చుట్టుముట్టారు. ఆకాశంలో చందమామ తన సౌందర్యాన్నంతటినీ విరజిమ్ముతున్నాడు. ఊరు అప్పటికే సద్దుమణిగింది. ఇటువంటి సమయాల్లో చెట్లనీడలకింద రోడ్డుమీద నడవటం, నిశ్శబ్దంగా జనసంచారం లేని రోడ్లమీద తాలూకాఫీసులో కాలమానాన్ని సూచించే గంటలు కొట్టడంవినటం రఘుకు చాలా ఇష్టం. రిక్షావాళ్ళను తప్పించుకొని ముందుకు వచ్చాడు. వెంకటలక్ష్మి అట్టే జనసంచారంలేని పెద్ద బజారులో వేగంగా నడుస్తూండటం అతణ్ణి ఆకర్షించింది. అతడు మామూలుగా నడుస్తున్నాడు. ఆమె వేగంగా నడవటంవల్ల అతడి నడక వేగాన్ని అనుసరించ గలుగుతున్నది.

రోడ్డుకు ఒకవైపున ఆమె, మరి ఒకవైపున అతడు నడుస్తున్నారు. మధ్యలో ఎన్నో రిక్షాలు వాళ్ళను దాటిపోయాయి. అప్పుడప్పుడు ఒకటిరెండు కార్లు. మధ్యలో ఏ రిక్షాలో నుండో ఎవరో తనను పలకరిస్తున్నారు. సుందరవిలాస్ ముందుకు వచ్చేసరికి రఘురామ్‌కు వాళ్లు గరిపొడిచింది. ఏమిటో లజ్జతోకూడిన సంకోచంకూడా కలిగింది. కిల్లీకొట్టు తెరిచేఉంది కాని బీడీకట్ట ఒకచేత్తో పట్టుకుని వెంకటేశ్వర్లు అక్కడలేడు.

వెంకటేశ్వర్లను తలుచుకోగానే రఘురామ్‌కు రోత కలిగింది. గారపట్టిన పళ్ళతో, బీడీ కంపునోటితో వెంకటేశ్వర్ల బొమ్మ మన

స్సులో చాలా వికృతంగా కనిపించింది. సన్నని, అందమైన, ఎర్రని వెంకటలక్ష్మి పెదవులు రఘురామ్ మనసులో మెదిలి అతడు మనస్సు లోనే చెంపలేసుకున్నాడు. చెప్పలేని దుఃఖంకూడా కలిగి 'పాపం కాదా?' అనుకున్నాడు. ఇద్దరూ రోడ్డుకు అద్దరినీ ఇద్దరినీ నడుస్తూనే ఉన్నారు. రఘు మనస్సు జాలితోనూ, విచారంతోనూ, పశ్చాత్తాపం తోనూ బరువెక్కిపోతున్నది. ఈ ప్రపంచాన్ని చెరిపి కొత్తకథ వ్రాసు కుంటే బావుండు ననిపిస్తున్నది మనస్సుకు. ఎవరో 'మల్లెపూలు కావాలా?' అని తన ముందునుంచే నడిచిపోయారు. రఘుకు కోపం వచ్చింది. తన నెవరో పరిహాపిస్తున్న ట్లనిపించింది. ఈ వెంకటలక్ష్మి తనకు అక్షరాభ్యాసం చేసి, వొంట్లూ ఎక్కాలూ నేర్పిన సత్యనారా యణగారి కుమార్తె. వాళ్ళెక్కడో తమకు దూరంగా బంధువులు కూడా. వాళ్ళూ దరిద్రులే. తండ్రి బ్రతికుండగా తమ రెండు కుటుం బాల మధ్య స్నేహసంబంధాలు బాగానే ఉండేవి. అప్పుడు పరిహాసా నికి సత్యనారాయణగారు తనను 'అల్లుడూ' అనికూడా పిలుస్తూ ఉండేవారు. తాను దత్తు పోవటానికి పూర్వందాకా ఈ పరిహాసానికి తగుమాత్రం విలువకూడా ఉండేది. వెంకటలక్ష్మి తమ ఇంటికి వచ్చి నప్పుడు తల్లికూడా ఆ పిల్లపట్ల ప్రత్యేకమైన శ్రద్ధాభిమానాలు చూపటం తనకు ఇప్పటికీ బాగా గుర్తు. తాను బి. ఏ. చదువుకుంటు న్నప్పుడుకూడా సత్యనారాయణగారు తనపట్ల ప్రత్యేకమైన శ్రద్ధా సక్తులు కనపరుస్తూ ఉండటం తా నెప్పటికీ మరచిపోలేదు. కాలేజీలో కూడా ఏదో ప్రత్యేకమైన పని కల్పించుకుని వచ్చి తననుగూర్చి వాకబుచేసేవా రాయన. తనను చూస్తే ఆయనగారి కెంతో సంతో షంగా ఉండేది. తాను దత్తుపోతున్నా నన్నవిషయం తెలిసేసరికి ఆయనగారు ఎంతో బాధపడ్డారు. తాను కాలేజీలో చదువుతున్నన్ని నాళ్ళూ వాళ్ళింటి ముందుగానే నడచిపోతూ ఉండేవాడు. ఇప్పుడు వాళ్ళింటి ముందుగా నడిచిపోవలసిన అవసరం తన కెంతమాత్రమూ లేదు.

కోర్టుకు వెళ్ళేప్పుడుమాత్రం తమ పాత ఇంటిమీదుగా

పోవలసి ఉంటుంది. అదికూడా ఇప్పుడు దారి తప్పించాడు.తన తల్లీ, అన్నా, ఇద్దరు తమ్ముళ్లూ ఇప్పుడు ఈ ఊళ్లో లేరు. తనకు ఈ ఊళ్లో 'నా' అన్నవాళ్ళను ఎవరినీ లేకుండా చేసిపోయా రనిపిస్తూ ఉంటుంది రఘుకు.

దానితో అతడికి తల్లిపైన, అన్నపైన, అందరిపైన, లోకం పైనకూడా అసంతృప్తి విరక్తీ కలుగుతాయి. అందరూకూడా ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకునేవాళ్ళలాగు, కుటిలులు దుర్మార్గులలాగు అతడు కోపగించుకుంటాడు. కాని అంతలోనే తాను అలా అందరి గురించీ అనుకున్నందుకు పశ్చాత్తప్త డవుతాడు.

సినిమాహాలుదగ్గర వెంకటలక్ష్మి మల్లెపూలు కొనుక్కుంది. రఘు చూశాడు. ఇక అతడు ఆ పక్కవీధిలోకి వెళ్ళిపోవాలి. ఇప్పుడు అమ్మ ఏంచేస్తూ ఉంటుందో? అన్నయ్య ఇంకా కోమటికొట్లో ఆవేళ లెక్కలు సరిచేసి ఇంటికి చేరిఉండడు. తనలాగే తన తమ్ముళ్లు కష్టపడి చదువుతూ ఉంటారు కాబోలు. తాను రేపు వెళితే ఎట్లా ఉంటుంది? అమ్మకు వెంకటలక్ష్మిని గురించి చెబితే, సంగీతం ట్యూషన్లు చెప్పి డబ్బు సంపాదిస్తున్నదని! తాను దత్తు పోకపోయినట్లైతే? వెంకటలక్ష్మినే తాను చేసుకునిఉంటే!? అర్థంలేని ప్రశ్నలు. అన్నయ్యకిలాంటి ప్రశ్నలు రావు. అన్నయ్య తనంత చదువుకోనుకూడా లేదు. కాని ఆ మనస్సు వేరు. ఆ నిబ్బరం వేరు. ఆ ఆలోచన వేరు. ఒక సారి ఒక స్నేహితు డెవరో రాగా పెళ్ళిళ్ళూ,సంబంధాలూ,కట్నాలూ, ఆర్థిక ఇబ్బందులూ, ఉద్యోగాలూ.పిల్లాజెల్లా కలగటం, సంసారంలో ఒడిదుడుకులు లేకుండా సాగిపోవటం మొదలైన అనేకవిషయాలు మాట్లాడుకున్నారు అన్నయ్యా, ఆ స్నేహితూడూను. అన్నయ్య అన్నాడు: "ఒరే రాజూ (ఆ స్నేహితుడు), ప్రతివాడి బతుకూ ఒక క్రాస్‌వర్డ్ పజిల్‌రా నాయనా. ఆల్‌కరెక్ట్ ఏదీ ఉండదు. ఇక కోటికి ఎవడేనా ఉంటాడేమో!ఆస్తిపాస్తి, తల్లిదండ్రులు, తండ్రి ఉద్యోగం, పైరాబడి, ఇంట్లో అందరికీ ఆరోగ్యం,పిల్లల చదువులు, వాళ్ళ ఉద్యోగాలు, ఆడపిల్లల పెళ్ళిళ్ళు—ఇవన్నీ గళ్లు. ఇక ఎవడి బతుకులోనైనా

ఆల్ కరెక్ట్ సొల్యూషన్ ఎప్పుడు? నాన్నగారు, మామగారు, ఆస్తి పాస్తులు, మామగారి ఉద్యోగం, నాన్నగారి ఆస్తి, లేక అటునుంచి ఇటు, పెళ్లాం, రూపం, గుణం, సంసారం, యోగ్యత, అన్నిటినీ మించి తమ ఇంట్లో ఇమడటం, పిల్లలు పుట్టడం, కావలసినదానికన్నా ఎక్కువడబ్బు రావటం, ఇవి అడ్డాలూ నిలువులూను. అడ్డాలు నింపితే నిలువులు ఖాళీగా ఉంటాయి; నిలువులు నిండితే అడ్డాలు ఖాళీగా ఉంటాయి. కనక రెండుమూడు తప్పులున్నా సొల్యూషన్ కనుక్కోవటం అదృష్టం."

అప్పుడు తనకు అన్నయ్యమాటలు అర్థంకాలేదు. ఏమిటో వాళ్లు సోది మాట్లాడుకున్న ట్లనిపించింది. అప్పటికే తనకు క్రాస్‌వర్డ్ పజిల్ అంటే ఏమిటో తెలుసు కాబట్టి వాళ్ళమాటలు కొంత అర్థమైనాయి. గుర్తు ఉన్నాయి. అప్పుడప్పుడు ఆ మాటలు ఆలోచనను రేపుతున్నాయి.

రఘురామ్ ఇంటికిచేరి వరండాలో పెద్ద ముగ్గులా మెరుస్తున్న వెన్నెలను చూసి పరమానందం పొందాడు. ఇప్పు డా వరండాలో ఏ స్తంభాన్నో ఆనుకుని శ్యామసుందరి తనకోసం ఎదురుచూస్తూఉంటే ఎంత బావుండును! అది అసంభవం అని అతడికి తెలుసు. అందుకే అతడికి ఎవరిమీదనో కసి. మనస్సునిండా దుఃఖం.

వరండా మెట్లెక్కి లోపలకు వెళ్లాడు. రేడియోలోంచి సిలోన్ సంగీతం వినపడక పోతున్నందుకు అతడికి చాలా ఆశ్చర్యంగా ఉంది. శ్యామసుందరి ఇంకా ఇంటికి రాలేదేమోనన్న ఆశంకతో కొంచెం దిగులైందికూడా. ఎదుటలేని వాళ్ళమీద కోపం ఎట్లాఅయినా కొంచెం తక్కువగానే ఉంటుంది. కాని తన ఆలోచన సరైనదికాదని తెలిసేపోయింది. హాల్లో అడుగుపెట్టగానే వాళ్ళమ్మగారు—అంటే తనకు సాక్షాత్తూ అత్తగారు "నాయనా, అమ్మాయికి విపరీతంగా తల నొప్పి వచ్చేసిందట. అన్నంకూడా తినకుండా మందేసుకుని కాఫీతాగి పడుకుంది. వడ్డించేశాను. మీరు రాండి" అన్నది.

రఘురామ్ ఏమీ మాట్లాడలేదు. శ్యామసుందరికి తలనొప్పి అని తెలియగానే అతడి మనస్సులో అంతటా ఆమెయెడల ప్రేమా జాలీ నిండిపోయాయి. పాపం! అన్నంకూడా తినలేదని మనస్సంతా ఎంతో మెత్తపడిపోయింది.

సన్నని లైటువెల్తురులో ఇప్పుడే పడుకున్నదని అత్తగారిచే చెప్పబడుతున్న శ్యామును లేపటం తన కిష్టంలేకపోయింది.

తనకు తలనొప్పి వస్తే చక్కని సంగీతం వింటే తగ్గిపోతుంది. ఇలా అనుకోగానే చక్కని సంగీతం వినాలంటే శ్యామసుందరికి తలనొప్పి వస్తుందన్న విషయంకూడా గుర్తువచ్చింది.

నాలుగు మెతుకులు తిని అతడు హాల్లోని గదిలోకి వచ్చాడు.

కిటికీలోంచి వెన్నెల రేడియోమీద పడుతున్నది.

తలలో సాయంకాలం అర్ధచంద్రాకారంగా ముడిచిన పూల చెండు టేబిల్‌మీద విసరివేసిందలా ఉన్నది శ్యామసుందరి. అది అక్కడ పడిఉంది.

క్షణంసేపు నిలుచుని నిద్రపోతున్న శ్యామసుందరివేపు చూశాడతడు. రంగులు వెలిసిపోయిన అందమైన మట్టిబొమ్మకు కొత్తగా రంగువేసి ఆరబెట్టినట్లున్నది శ్యామసుందరి అతడికి.

———